క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



చెరువుపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నపుల్లయ్య భూమి పూజ చేశారు. రూ.15లక్షల డీఎంఎఫ్ నిధులతో రాజమ్మగారి సయ్యద్ హుస్సేన్ ఇంటి నుంచి పెనుగొండ బాబయ్య వీధి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా, సూర్యనారాయణరెడ్డి, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా సాయం అందజేత



బాధితురాలకి నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

సంజామల: మండల కేంద్రం సంజామల గ్రామానికి చెందిన లొడుగు లక్ష్మీ నరసింహ(38) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య లొడుగు మహేశ్వరికు గురువారం వైఎస్‌ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహబూబ్ హుస్సేన్, డిజిటల్ అసిస్టెంట్ బాలజీ అందజేశారు.

పసుపల గ్రామంలో....



బాదిత కుటుంబానికి వైఎస్సార్‌బీమా తక్షణ సహాయం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల గ్రామానికి చెందిన నాగేశ్వరప్ప(35) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను బాధిత కుటుంబానికి పంచాయతీ కార్యదర్శి సుబ్బమ్మ, బనగానపల్లె మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు ఎస్ జనార్దన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు,గృహసారథి నాగశేఖరప్ప, వీఆర్‌ఓ వంశీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్టమీద వెలసిన మీరావలి దర్గాలో గురువారం భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు నిర్వహించారు. మొహర్రం ముగిసిన 40వ రోజున నిర్వహించే జియారత్ వేడుకలను పురస్కరించుకుని దర్గా కమిటీ అధ్యక్షుడు సత్యరాజు ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూలదట్టీలు, జెండాలతో ఊరేగింపుగా వచ్చి మీరావలి పీరుకు అలంకరించారు. అనంతరం ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వివాహానికి హాజరైన మంత్రి బుగ్గన



నూతన వధువరులతో మంత్రి బుగ్గన, ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణానికి చెందిన సింగిల్ విండో చైర్మన్ వంకెన్‌దిన్నె రుద్రవరం నారాయణ, లక్ష్మీ మహేశ్వరి దంపతుల కుమార్తె వధువు లోహిక, వరుడు అరవింద్ వివాహం గురువారం స్థానిక షిరిడీ సాయిబాబా కల్యాణ మండపంలో జరిగింది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ మహేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

ఎంపీడీఓగా పదోన్నతి

సంజామల: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఎల్ పాపరాయుడుకు ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయనను ఎంపీడీఓగా వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ ముస్తాబు!

- ఆర్థిక మంత్రి చొరువతో రూ.1.33 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ
- సమృద్ధిగా వసుతులు, పెరిగిన బస్సు సర్వీసులు
- నేడు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఆకర్షణీయంగా బస్టాండ్ ముఖద్వారం

బేతంచెర్ల: డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు, పొలాల రహదారుల నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదేవిధంగా బేతంచెర్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యనిస్తున్నారు. కనీస వసతులు కరువైన బేతంచెర్ల బస్టాండ్‌కు మంత్రి బుగ్గన చొరువతో మహర్దశ చేకూరింది. 1993లో బస్టాండ్ ఏర్పాటుకు తన చిన్నాన్న రామ్మోహన్ రెడ్డి ఎకర విరాళంగా ఇవ్వగా నేడు సకల వసతులతో సుందరంగా తీర్చిదిద్దారు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఆధునీకరణకు మంత్రి చొరవతో రూ.1.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో బస్టాండ్ ఆకర్షణీయంగా మారింది. గతంలో ఉన్న మూడు ప్లాట్ ఫామ్స్‌తోపాటు మరోరెండు అదనంగా ఏర్పాటు చేశారు. స్త్రీలకు అనుగునగా మరుగుదొడ్లు నిర్మించారు. మట్టి, గుంతలమయంగా ఉన్న బస్టాండ్ ప్రాంగణం సుందరంగా మారింది. సీసీ రోడ్లు, గ్రానైట్ ఫ్లోరింగ్, క్లాడింగ్, గ్లోసన్ బోర్డులు, రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలు, ఫ్యాన్లు, ప్రహరీ నిర్మించారు. ముందు భాగన మొక్కలు నాటడంతో ఆర్టీసీ బస్టాండు రూపు రేఖలు మారిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది బేతంచెర్ల బస్టాండేనా అనేంగా మారిపోంది. శుక్రవారం బస్టాండ్‌ను మంత్రి పారంభించనున్నారు.

బేతంచెర్ల మీదుగా అదనపు బస్సులు

ప్రజల విన్నపం మేరకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో బేతంచెర్ల మీదుగా అదనపు సర్వీసులు ఏర్పాటయ్యాయి. రంగాపురం సమీపాన వెలసిన ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి స్వామికి కర్నూలు నుంచి ప్రత్యేకంగా ఓ బస్సు ఏర్పాటు అయ్యింది. కర్నూలుకు చెందిన భక్తులు నేరుగా మద్దిలేటయ్యను దర్శించుకునేందుకు వసతి సమకూరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బేతంచెర్ల మీదుగా డోన్ విజయవాడ, నంద్యాల- బెంగళూర్ నగరాలకు బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించడంతోపాటు అదనంగా బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి బుగ్గనకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



సుందరంగా తీర్చిదిద్దిన ఆర్టీసీ బస్టాండ్



స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

డోన్ : డోన్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి కమిషనర్ వెంకట్రామిరెడ్డితో పాటు 31 మంది కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అదేవిధంగా చిగురుమానుపేట ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కొత్తగా 75 హెచ్‌పీ మోటార్ కొనుగోలు, తారకరామ నగర్ నుంచి 44వ జాతీయ రహదారి కంబాలపాడు సర్కిల్ వరకు రూ.30లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల ఏర్పాటుకు సభ్యులు ఆమోదం తెలిపారు. వైఎస్ఆర్ విగ్రహం నుంచి వెడల్పు చేసిన రహదారుల వెంట వీధిలైట్లను ఏర్పాటుకు, నారాయణ స్కూల్ వద్ద రూ.10లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, నీటిని శుద్ధజలంగా మార్చేందుకు అవసరమైన ఆలం, క్లోరిన్ కొనుగోలుకు 14, 15 ఆర్థిక సంఘం నిధులను కేటాయించాలని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారని చైర్మన్ తెలిపారు. సమావేశంలో డీఈ రసూల్, ఏఈ సురేష్, టౌన్ ప్లానింగ్ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంజీవనగర్‌లో పర్యటించిన చైర్మన్



ప్రజలతో మాట్లాడుతున్న చలంరెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో గురువారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పర్యటించారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలను పరిశీలించారు. అదేవిధంగా కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలపై చర్చించారు. ప్రాధాన్యత మేరకు దశల వారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర మౌలిక వసతులు కల్పిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు నాగరాజు, రామనాయుడు, నిరంజన్, మల్లీ, తిరుమలేశ్వర్ రెడ్డి, ఆనంద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం



సమావేశమైన కమిటీ సభ్యులు

బనగానపల్లెరూరల్: స్థానిక నాయీబ్రహ్మణ కాలనీలోని రామాలయంలో గురువారం బనగానపల్లె పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కార్యనిర్వాహణాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఐకమత్యంగా నిర్వహించేందుకు సభ్యులు కృషి చేయాలన్నారు. పట్టణంలో గణనాధులను 18న మండపాల్లో ఏర్పాటు, 22న నిమజ్జనం నిర్వహించాలని తీర్మానించామన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవంపై చర్చించారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు జగన్నాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గద్దం నాగముని, సురేష్, పుల్లన్న, యాదగిరి, కార్తీక్, అరవింద్ మద్దిలేటి, నరసయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి రాఖీ కడుతున్న దృశ్యం

కోవెలకుంట్ల: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఒకరికొకరు జీవితాంతం రక్షగా ఉండాలనే సందేశానికి సూచకంగా అన్నలు, తమ్ముళ్లకు చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు.

ఎమ్మెల్యే కాటసానికి రాఖీ కట్టిన మహిళా ప్రజాప్రతినిధులు

బనగానపల్లె: రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళా ప్రతినిధులు, అధికారుణిలు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మతో పాటు పలువురు మహిళా వార్డెన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రతి అక్కకు,ప్రతి చెల్లెమ్మకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారు నాపై చూపుతున్న ప్రేమా అభిమానాలు మరువలేనివని కృతజ్ఞతలు తెలిపారు. అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటానన్నారు.

డోన్ టౌన్: సమాజంలో తోటి వారి పట్ల సోదరి సోదర భావంతో మెలిగి శాంతి స్థాపనకు కృషి చేయాలని ప్రజా ప్రిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలం డోన్ కేంద్రం(ఓంశాంతి)నిర్వాహకురాలు లక్ష్మీ బెహెన్ అన్నారు. రక్షా బంధన్ (రాఖీ)పండుగను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో వారు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కదుతున్న దృశ్యం

బేతంచెర్ల: అన్నా చెల్లెళ్లు అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ అనురాగ బంధానికి ప్రతి కగా జరుపుకునే రాఖీ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నా, తమ్ముళ్లకు చెల్లెల్లు, అక్కలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఓం శాంతి బ్రహ్మ కుమారి సభ్యులు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించారు. ఈసందర్భంగా మంత్రి బుగ్గన రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఆర్డీఓ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ విద్యాసాగర్‌తో కలిసి సర్వే, రెవెన్యూ సిబ్బందికి భూసర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్డీఓ అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ జగనన్న భూరక్ష- భూ హక్కు కార్యక్రమంలో భాగంగా డోన్ మండలంలోని కొత్తబురుజు, ఎద్దుపెంట, చనుగొండ్ల, కామగానికుంట్ల, యాపదిన్నె, కొచ్చెర్వు, వలిసెల, జగదుర్తి గ్రామాల్లో సెప్టెంబర్ 1 నుంచి మూడవ విడుత రీ సర్వే చేపట్టాలన్నారు. భూ సర్వేకు సంబంధించిన వివరాలను గ్రామంలో దండోరా వేయించి రైతులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా గ్రామ సభ ఏర్పాటు చేసి సర్వే ఉద్దేశాన్ని రైతులకు వివరించి పట్టాదార్ పాస్ పుస్తకం, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, పొలానికి సంబంధించిన డాక్యూమెంట్లు తదితర జిరాక్స్ కాపీలను తీసుకోవాలన్నారు. ఏ మాత్రం పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పక్కాగా చేయాలని సూచించారు.

సర్వే పరిశీలన

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో ప్రజల నివాసాలు, ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి జరుగుతున్న సర్వేను గురువారం ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రీసర్వేతో ప్రజల ఆస్తులకు భద్రత ఏర్పడుతుందని, ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. సర్వే పూర్తి అయ్యాక యజమానికి ఆస్తికి చెందిన ధృవపత్రాల్లో అన్ని వివరాలు నమోదు చేసి అందిస్తామన్నారు.

అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ భార్గవిలత, పంచాయితీ కార్యదర్శి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్షణ పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీ సర్వే పక్కగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక పాదుపు భవనంలో బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల మండలాల వీఆర్‌ఓలు, గ్రామ సచివాయాల సర్వేయర్లుతో రీ సర్వేపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తయిన రీసర్వే భూముల్లో హద్దులను చూపించే సర్వే స్టోన్స్ పాతించాలన్నారు. అదేవిధంగా రెండవ ఫేస్ కింద ఎంపిక చేసుకున్న గ్రామాల్లో రీ సర్వే పనులు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు తహసీల్దార్‌లు వెంకటేశ్వర్లు, పుష్పకుమారి, శ్రీనివాసులు, మండల సర్వేయర్లు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు ప్రారంభానికి సిద్ధం



రవ్వలకొండపై నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు



ఎన్జీఓ కాలనీలో ఏర్పాటు చేసిన ట్యాంకు

బనగానపల్లె: ఎట్టకేలకు సుమారు బనగానపల్లె పట్టణ ప్రజలకు నీటి సమస్య తీరనుంది. పట్టణంలోని రవ్వలకొండపై రూ. 1.50 కోట్లతో 2.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, ఎన్జీఓ కాలనీలో రూ.1.18 కోట్లతో రూ.2.50లక్షల లీటర్ల సామర్థ్యం ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటికే పైప్‌లైన ద్వారా పట్టణ ప్రజలకు నీటిని ట్రైల్ రన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఇబ్బందిలేకుండా విజయవంతం అయింది. త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవంగావించి నీటిని సరఫరా చేయడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి తెలిపారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తికావడంతో పట్టణంలో తాగునీటి సమస్య ఉండదన్నారు. అదేవిధంగా మండలంలోని బీరవోలు గ్రామంలో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించి నీటిని విడుదల చేస్తామని డీఈఈ తెలిపారు.

బార్ అసోసియేషన్‌కు బీరువా విరాళం

బనగానపల్లెరూరల్: స్థానిక బార్ అసోషియేషన్ కార్యాలయానికి న్యాయవాదులకు సౌకర్యార్థం అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ సేఫ్‌లాకర్స్ బీరువా విరాళంగా అందజేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఆర్ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. మాజీ అధ్యక్షులు జెడ్ వీ కృష్ణారెడ్డి విన్నపం మేరకు ఆమె సుమారు రూ.20 వేల విలువ బీరువాను అందజేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, వీఆర్ ప్రకాష్‌రెడ్డి, రాజుకుళ్లాయి, ఎం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

881 కొత్త పింఛన్ల మంజూరు

బనగానపల్లె : బనగానపల్లె నియోజకవర్గానికి మరో 881 కొత్త పింఛన్ల మంజూరయాయ యని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. బనగానపల్లె మండలానికి 305, కోవెలకుంట్ల - 132, కొలిమిగుండ్ల -167, అవుకు - 158, సంజామల మండలానికి 119 కొత్త పింఛన్ల మంజూరయ్యాయన్నారు. సెప్టెంబర్ 1న పింఛన్ సొమ్ము అందజేస్తామని తెలిపారు.

ద్విచక్రవాహనం కాల్చివేత

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండాకు చెందిన మద్దిలేటి నాయక్ ద్విచక్రవాహనాన్ని సిమెంట్ నగర్ గ్రామ సమీపాన సుంకులమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలేటి నాయక్ హోండా షైన్‌ను ఇంటి ముందు పార్కుచేసి ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని అపహరించారు. గురువారం ఉదయం ఇంటి ముందు ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే గ్రామ సమీపాన ద్విచక్రవాహనం ఉందని తెలియడంతో వెళ్లి చూడగా కాల్చివేశారని బాధితుడు వాపోయాడు.

ఇద్దరికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె-కాశిపురం గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అయ్యా యి. స్థానికుల సమాచారం మేరకు రెడిపల్లె గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి, సుబ్బరాయుడు కాశిపురానికి బైకుపై వెళ్తున్నారు. అదే సమయంలో మరో వ్యక్తి బైక్‌పై ఇటుగా వస్తున్నాడు. కాల్వ సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొట్టడంతో ప్రమాదం ఈ జరిగింది. సుదర్శన్ రెడ్డి, సుబ్బరాయుడి తలలకు గాయాలయ్యాయి. 108లో స్థానికులు కొవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి ఆలయంలోని ప్రసన్న మండపంలో విష్ణు సహస్రనామ పారాయణం అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతం ఉంటుందన్నారు. పూజా సామగ్రిని భక్తులే తెచ్చుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే కాటసానిని సన్మానించిన సహకార సంఘం సభ్యులు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బనగానపల్లె: స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గురువారం భానుముక్కలసహకార సంఘం సభ్యులు, అధికారులు, రైతులు ఘనంగా సన్మానించారు. రైతులకు రుణాలు ఇవ్వడం రికవరి చేయడంలో అగ్రగామిగా మొదటి స్థానంలో నిలిచిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, సీఈఓ అబ్దుల్‌మునాఫ్ తదితరులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘం ఉమ్మడి జిల్లాల్లో అగ్రగామిగా నిలవడంతో స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారం ఎంతో ఉందన్నారు. మొదటి స్థానంలో నిలిచినందుకు ఈ నెల 4న విజయవాడలో ఆప్కాబ్ 60 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా మంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డి చేతుల మీదుగా మేమోంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

రేపు వైఎస్సార్ వర్ధంతి

బనగానపల్లె: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని సెప్టెంబర్ 2న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచా ర కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తా మన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘా ల నాయకులు, కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు తరలిరావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

వీఓఏ సంఘం మండల అధ్యక్షుడిగా నాగంజనేయులు

సంజామల: వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అకౌంటెంట్) సంఘం నూతన మండల అధ్యక్షుడిగా నాగంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల స్త్రీ శక్తి భవన్‌లో పొదుపు సహాయక సంఘం వీఓఏల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షురాలిగా సుమలత, కార్యదర్శిగా సువర్ణ, సహయక కార్యదర్శిగా పవిత్రదేవి, కోశాధికారిగా పార్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీఓఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరపతయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు వెంకట్, నాయకులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 3వ విడత భూముల రీసర్వే

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం, ఎం,పేండేల్లు, గోర్లగుట్ట గ్రామాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 3 విడత భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో వీఆర్వోలు, సర్వేయర్లు దండోరావేయించడమే కాకుండా గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు భూ రీ సర్వేపై అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం

డోన్ టౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం అని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు పిలుపునిచ్చారు. సీపీఎం చేపట్టిన సమర భేరి కార్యక్రమంలో గురువారం కోట్ల వారిపల్లె, ధర్మారం పంచాయితీ పరిధిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే పనిలో ఉన్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు నక్కి శ్రీకాంత్,రామాంజనేయులు, శివరాం, నాగమద్దయ్య, షమీమ్‌బేగం పాల్గొన్నారు.

జిల్లాకు 13వేల టన్నుల ఎరువులు సరఫరా

చాగలమర్రి: నంద్యాల జిల్లాకు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం 13వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేసిందని జిల్లా మేనేజరు నాగరాజు తెలిపారు. ఆయన గురువారం మండలంలోని మద్దురు గ్రామ ఆర్‌బీకేను సందర్శించారు. అలాగే దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లోని ఆర్‌బీకేలను కూడా తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటలకు అనుగుణంగా కాంప్లెక్స్ ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రభుత్వం యూరియా 50 శాతం, డీఏపీతో పాటు కాంప్లెక్స్ ఎరువులను నిష్పత్తిని బట్టి కేటాయిస్తుందని చెప్పారు. జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉన్నాయని, వాటిలో ఇప్పటి వరకు 2,321 డీఏపీ, 1415 ఎన్‌పీకే, యూరియా 2,200, ఎంఓపీ 75 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయని వివరించారు. మద్దతు ధరతో రైతుల నుంచి సుమారు 1,060 టన్నుల పసుపు కొనుగోలు చేశామన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి పూర్వారాధన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీ ఆంజనేయ కోదండ రామస్వామి దేవస్థానం ఆవరణలో వెలసిన శ్రీగురురాఘవేంద్ర స్వామి 352 ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి పూర్వారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు విటల్ వరదచారి, సుధీంద్రాచార్యుల ఆధ్వర్యంలో మృతికా బృందావనానికి ఉదయామే పంచామృతాభిషేకాలు, తిరుమంజనసేవ తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి వారి బృందావనానికి ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం మాజీ చైర్మన్ చెన్నవెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రామాంజనేయశర్మ, ప్రహ్లాదస్వామి పాల్గొన్నారు.

పంటలు నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ కిరణ్ కుమార్

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని గోరుమానుకొండ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఏఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటల నమోదు వలన రైతులు రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, మద్దతు ధరలకు పంటలను అమ్ముకోవడం తదతరు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. రైతులు ఆర్బీకేలకు వెళ్లి సెప్టెంబర్ 15 వ తేదీలోగా సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.